సాక్షి నిజామాబాద్

శుక్రవారం, 2, జూన్, 2023



ఉద్యమ వ్యతిరేకులే పాలకులయ్యారు

తెలంగాణ సాధన ఉద్యమంలో వ్యతిరేకంగా పని చేసిన వారే ప్రభుత్వంలో పాలకులయ్యారని ప్రొఫెసర్ జయధీర్ విమర్శించారు.

- 8లో ▸



పసుపు సాగులో మెలకువలు

వానాకాలం పసుపు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఉద్యాన అధికారి రోహిత్ సాగు మెలకువలను వివరించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40.9 /27.9

ఉదయం నుంచే ఎండ ప్రకాశవంతంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్





నిజామాబాద్‌నాగారం : అలుపెరుగని పోరాటాలు.. అనేక త్యాగాల ఫలితంగా ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు గురువారం ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఇంటింటికి రక్షిత మంచినీరు, సాగు జలాలు, సేద్యానికి 24 గంటల విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు వంటి అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పల్లె, పట్టణ ప్రగతితో గ్రామగ్రామాన పరిశుభ్రత, పచ్చదనం వెల్లివిరుస్తూ వరుసగా జాతీయ అవార్డులు వరిస్తుండడం తెలంగాణ ప్రగతికి ప్రామాణికంగా నిలుస్తోందన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల స్వల్ప వ్యవధిలోనే అనితరసాధ్యమైన అభివృద్ధి, సంక్షేమాన్ని ఆచరణాత్మకంగా నిరూపించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతమైన పాలన దిశగా ముందుకెళ్లాలనే సంకల్పంతో దశాబ్ది ఉత్సవాలను చేపడుతోందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం స్ఫూర్తితో రాష్ట్ర ప్రగతిలో సబ్బండ వర్ణాలు మమేకమవుతూ, దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

తెయూ సెలవులు రద్దు

డిచ్‌పల్లి : తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్, సారంగాపూర్ కళాశాల విద్యార్థులకు ప్రకటించిన సెలవులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు హాస్టల్స్ సౌకర్యం ఉంటుందన్నారు.

స్కాలర్‌షిప్‌ల గడువు పొడిగింపు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు స్కాలర్‌షిప్ దరఖాస్తుల కోసం తేదీని పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు, రెన్యూవల్ చేసుకునేవారు ఈనెల 15వ తేదీ లోపు http://telanganaepass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఈసీ సమావేశం నిర్వహిస్తే క్రమశిక్షణ చర్యలు

- ఈసీ సభ్యులకు వీసీ లేఖ
- తదుపరి ఈసీ మీటింగ్ తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి(ఈసీ) సమావేశం జూన్ 3న (శనివారం) జరుగనున్న నేపథ్యంలో గురువారం ఈసీ సభ్యులకు వీసీ డి రవీందర్ గుప్తా ఒక లేఖ రాశారు. 2023 ఏప్రిల్ 19న జరిగిన తెలంగాణ వర్సిటీ 55వ పాలకమండలి (ఈసీ) సమావేశంలో ఆమోదించిన అన్ని తీర్మానాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని వీసీ లేఖలో తెలిపారు. 55వ ఈసీ సమావేశం తీర్మానాల ఆధారంగా మాత్రమే తదుపరి ఈసీ సమావేశాలు నిర్వహించారన్నారు. ఇది కోర్టు ధిక్కారంగా పరిగణించబడుతుందన్నారు. 2016 జూన్ 1 యూనివర్సిటీల చట్టం సెక్షన్ 13 (1) ప్రకారం వైస్-ఛాన్స్‌లర్ పాలకమండలి (ఈసీ) సభ్యుడు, చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సెక్షన్ 11(3) ప్రకారం ఈసీ సమావేశం నిర్వహించే అధికారం వీసీకే ఉంటుందని వీసీ రవీందర్‌గుప్తా వివరించారు. అందువల్ల తదుపరి ఈసీ సమావేశాలు నిర్వహించవద్దని తెలిపారు. సమావేశం నిర్వహించినట్లయితే ఈసీ సభ్యులందరిపై క్రమశిక్షణ చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన నేతృత్వంలో తెలంగాణ యూనివర్సిటీలోనే ఈసీ సమావేశం నిర్వహిస్తామని అందుకు సంబంధించిన ఎజెండాను త్వరలో ఈసీ సభ్యులకు పంపిస్తామని తెలిపారు. ఈ విషయమై కొందరు ఈసీ మెంబర్లను సంప్రదించగా వీసీ తమకు లేఖ పంపించిన మాట వాస్తవమేనన్నారు. అయితే వీసీ లేఖను పట్టించుకోమని జూన్ 3న జరగబోయే ఈసీ సమావేశానికి హాజరవుతామని వారు తెలిపారు.

దశాబ్దిలో మెరిసిన సమీకృత భవనం..



విద్యుత్ దీపాలంకరణలో కలెక్టరేట్

ఐటీ హబ్ మరో కలికితురాయి

- పోడు భూములకు అందనున్న పట్టాలు
- కొత్త మండలాలు, పంచాయతీలకు చేరువైన పాలన
- అంతంత మాత్రంగానే పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- కొనసాగుతూనే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ పనులు
- లక్ష్యం నెరవేరని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- పదేళ్ల పాలనలో సంతృప్తి, అసంతృప్తి కలయికలు

నిజామాబాద్ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నిర్మించిన జిల్లా కార్యాలయాల సమీకృత భవనం, ఐటీ హబ్ లాంటి అభివృద్ధి పనులు జిల్లా చరిత్రలో నిలిచిపోనున్నాయి. ఈ దశాబ్ద కాలంలో కొన్ని పనులు సంతృప్తి కరంగా పూర్తయినా.. మరికొన్ని విభాగాల్లో పనులు కొనసాగుతూనే ఉన్నాయి. పూర్తయిన పనులు ప్రజల చేరువలోకి వచ్చాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక కథనం...

గ్రామ పంచాయతీల్లో మెరుగైన పనులు

గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ పంచాయతీలకు ఎక్కువ నిధులు ఇవ్వడంతో కొత్త పనులు అందుబాటులోకి వచ్చాయి. గ్రామాల్లో హరితహారం, పల్లె ప్రగతి, డంపింగ్‌యార్డులు, శ్మశాన వాటికల నిర్మాణాలు, కాంపోస్ట్ షెడ్డు నిర్మాణం, పల్లె, ప్రకృతివనాలు వల్ల గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి అందుబాటులోకి వచ్చింది.

దళిత బంధు, పోడు భూములు

దళిత బంధు పథకం కింద ఎస్సీలకు గరిష్ఠంగా రూ.10 లక్షల చొప్పున మొదటి విడతలో 550 మందికి ఆర్థిక సహాయం అందించారు. రెండో విడతకు కసరత్తు జరుగుతోంది. ఈనెల 24న పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నారు. జిల్లాలో పోడు భూముల దరఖాస్తులు 14050 రాగా, ఇందులో 2876 మందిని అర్హులుగా గుర్తించారు.

మన ఊరు –మన బడి..

మన ఊరు – మన బడి ద్వారా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, మరమ్మతులు చేపట్టారు. జిల్లాలో మొదటి విడతలో 407 పాఠశాలలను ఎంపిక చేశారు. 341 పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో, 66 పాఠశాలలు పట్టణప్రాంతాల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు 59 పాఠశాలల పనులు పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు రూ.16.37 కోట్ల నిధులు మంజూరు చేశారు.

20,21 ప్యాకేజీ పనులు

జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 20, 21 పనులు ఇంకా కొనసాగుతున్నాయి. పాత డిజైన్ ప్రకారం పనులు చేపట్టాలని మంచిప్ప రిజర్వాయర్ పనులను నిర్వాసితులు అడ్డుకుంటున్నారు. సారంగాపూర్ వద్ద మూడు పంపులు ఏర్పాటు చేసి నీటిని పంపిణీ చేయవల్సి ఉండగా ఈపనులు నేటి వరకు కొనసాగుతున్నాయి.

సూపర్ స్పెషాలిటీ ఎప్పుడో..

జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందడం లేదు. 750 పడకలతో అన్ని రకాల వైద్య నిపుణులు, వైద్యపరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చి 24 గంటల సేవలు అందించాలన్న లక్ష్యం నెరవేరలేదు.

వేడుకలకు ఏర్పాట్లు

నిజామాబాద్ నాగారం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)ను అన్ని విధాలుగా ముస్తాబు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇతర అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఐడీఓసీలో నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 9.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకుముందు వినాయకనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించనున్నారు. మంత్రితో పాటు జిల్లా కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పుర ప్రముఖులు ఈ వేడుకలకు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా పాలనాధికారి నేతృత్వంలో తుది ఏర్పాట్లను పరిశీలించారు. ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతున్న దశాబ్ది ఉత్సవాలను రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలతో శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో మరింత విస్తత ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆర్‌వోబీ, విమానాశ్రయం..

జిల్లాలో మాధవనగర్ వద్ద ఆర్‌వోబీ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్రం ముందుకు రాకపోవడంతో సంవత్సరాల తరబడి ఆలస్యం జరిగింది. జక్రాన్‌పల్లి వద్ద కేంద్రం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అనుమతి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం లేదు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇటీవల పనులు ప్రారంభమయ్యాయి. సంవత్సరాల తరబడి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా కేంద్రంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మున్సిపాలిటీ నూతన భవనం సంవత్సరాల నుండి కొనసాగుతున్నా పూర్తి కావడం లేదు.



నిర్మాణం పూర్తయిన ఐటీ హబ్ భవనం

ఆకర్షణీయంగా కలెక్టరేట్

- నూతన హంగులతో నిర్మితమైన జిల్లా కార్యాలయాల సమీకృత భవనం, ఐటీ హబ్‌లు జిల్లా చరిత్రలో తలమానికంగా నిలిచాయి. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో 19 ఎకరాల్లో రూ.62 కోట్లతో సమీకృత భవనం, రూ.52 కోట్లతో ఐటీ హబ్ నిర్మాణం పూర్తయ్యాయి. త్వరలో ప్రాంభం కానున్న ఐటీ హబ్‌తో సమారు 700 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 3 వేల మందికి ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. రైల్వే కమాన్ వద్ద నిర్మించిన ఆర్‌యూబీతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తీరినట్లయింది. నగరంలో రూ.27 కోట్లతో చేపట్టిన రఘునాథ చెరువు సుందరీకరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.
- కొత్త మండలాలు, పంచాయతీల ఏర్పాటుతో ప్రజలకు పాలన చేరువైంది. కొత్తగా 12 మండలాలు, 151 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. తండాలు సైతం పంచాయతీలుగా ఏర్పాటు కావడంతో పరిపాలన అందుబాటులోకి వచ్చింది.

నెరవేరని హామీలు.. కొనసాగుతున్న జాప్యం

జిల్లాలో డబుల్‌బెడ్‌రూమ్‌ల పంపిణీ సంతృప్తికరంగా లేదు. ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాల్లో ఇళ్ల పంపిణీ నామమాత్రంగానే ఉంది. నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లో కొద్దిమేరకు ఇళ్ల పంపిణీ చేశారు. నిజామాబాద్ అర్బన్‌లో ఇళ్ల నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతున్న పంపిణీ జరుగలేదు.

రౌడీ షీటర్ దారుణ హత్య

- హతుడు ఆరిఫ్ గతంలో హత్య కేసులో నిందితుడు
- లారీతో బుల్లెట్‌ను ఢీకొట్టిన ప్రత్యర్థులు
- అనంతరం కత్తులతో దాడిచేసిన ఎనిమిది మంది
- ఆరిఫ్ వెంట ఉన్న మరొకరికి తీవ్రగాయాలు



హతుడు వినియోగించిన బుల్లెట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు



ఆరిఫ్‌డాన్ (ఫైల్)

ఖలీల్‌వాడి (నిజామాబాద్)/ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండల కేంద్ర శివారు నిజామాబాద్ రోడ్డులో రౌడీ షీటర్ ఆరిఫ్ డాన్‌ను ప్రత్యర్థులు పట్టపగలు హత్య చేశారు. ఆరిఫ్ డాన్ గురువారం ఓ దొంగతనం కేసులో బోధన్ కోర్టుకు పేషీపై వెళ్లాడు. కోర్టు వాయిదా పడటంతో తిరిగి నిజామాబాద్‌కు స్నేహితుడు బుల్లెట్ ఖాదర్, మరో ఇద్దరితో కలిసి రెండు బైక్‌లపై వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆరిఫ్ డాన్, బుల్లెట్ ఖాదర్ కలిసి వస్తున్న బుల్లెట్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఇద్దరు కింద పడిపోయారు. లారీలోంచి ఎనిమిది మంది దిగి వీరిద్దరిపై కత్తులతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ఆరిఫ్‌డాన్ రక్తపు మడుగులో పడి అక్కడిక్కడే చనిపోయాడు. బుల్లెట్ ఖాదర్ కాలు విరిగింది. తలపై కత్తిపోట్లు పడ్డాయి. వీరివెంట మరో బైక్‌పై వస్తున్న ఇద్దరు పారిపోయినట్లు తెలిసింది. ఘటన స్థలాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్, ఇద్దరు సీఐలు పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ ఆరిఫ్ ఓ దొంగతనం కేసులో బోధన్‌కోర్టుకు వెళ్లి వస్తుండగా ఈ హత్య జరిగినట్లు తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది జనవరి 1న నగర శివారులోని సారంగపూర్ వద్ద జరిగిన ఒకరి పుట్టిన రోజు వేడుకలకు ఆరిఫ్, ఇబ్రహీంఛావూస్ అలియాస్ జంగిల్ ఇబ్బు హాజరయ్యారు.

సాంగ్ వేసే విషయంలో గొడవ జరిగి ఇబ్రహీంఛావూస్‌ను ఆరిఫ్‌డాన్ అతని అనుచరులు కత్తులతో దాడిచేసి హతమార్చారు. ఈ కేసులో మూడు నెలల క్రితమే ఆరీఫ్‌డాన్ జైలు నుంచి బయటకు వచ్చారు. ఆరిఫ్ హత్యలో సిద్దు, కరీంలాల, సమద్, ఇర్ఫాన్, సోహెల్, హద్దు, చోటసోహైల్ అనే వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇబ్రహీంఛావూస్, ఆరిఫ్‌డాన్ గతంలో కలిసి ఇల్లీగల్ దందా చేసేవారని తెలిసింది. పంపకాలలో వచ్చిన తేడాతోనే ఒకరిపై ఒకరు కక్ష పెంచుకుని ఇద్దరూ హతం అయ్యారు. దీని వెనుక పాత రౌడీషీటర్ల హస్తంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆ ప్రాంతంలోనే ఇల్లీగల్ దందాలు..

నగరంలోని మాలపల్లి, ఆటోనగర్, సారంగపూర్, నెహ్రూనగర్, బాబాసాహెబ్‌పహాడ్, బోధన్ రోడ్డు, నాగారం ప్రాంతంలో ఇల్లీగల్ దందా జోరుగా సాగుతుంది. ఇక్కడ బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, బీహార్ ప్రాంతాలకు చెందినవారు ఎక్కువగా ఉంటారు. ఈ ప్రాంతంలో పీడీఎస్ బియ్యం, గంజాయి, మట్కా, భూ మాఫియా, మామూళ్ల వసూళ్ల ఎక్కువగా జరుగుతాయి. రాత్రి వేళ్లలో సాగే దందాను పోలీసులు చూసీచూడనట్లు ఉంటారని విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాంతాలు ఉన్న ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందని పోలీసుల దృష్టికి వచ్చినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

పీడీఎస్ బియ్యం రవాణా చేసే వ్యాపారి ఒకరు పోలీస్‌స్టేషన్‌లో జరిగే కార్యక్రమాలకు కావాల్సిన సౌకర్యాలు సమకూరుస్తారనే ప్రచారం కూడా ఉంది. పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతాలపై దృష్టి సారించి సామాన్యులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మారుతున్న సమీకరణలు

- ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న పారిశ్రామికవేత్త పైడి రాకేష్‌రెడ్డి
- ఢిల్లీలో కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న అగ్రనేత తరుణ్‌ఛుగ్
- టిప్పర్‌తో ఢీకొట్టి చంపించే హత్యారాజకీయాలను రూపుమాపుతాం..
- ఆర్మూర్‌లో బ్లాక్‌మెయిల్, బెదిరింపు రాజకీయాలకు తావులేకుండా చేస్తా..
- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి హెచ్చరిక జారీ చేసిన రాకేష్‌రెడ్డి !
- ఇప్పటికే జీవన్‌రెడ్డిపై గుర్రుగా ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులతో మంతనాలు



తరుణ్‌ఛుగ్, ఎంపీ అర్వింద్‌లతో రాకేష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో కీలకమైన ఆర్మూర్ నియోజకవర్గంలో ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ సమీకరణలు మారుతున్నాయి. అంకాపూర్‌కు చెందిన పారిశ్రామికవేత్త, నైన్ స్టార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ పైడి రాకేష్‌రెడ్డి గురువారం ఢిల్లీలో ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాకేష్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి రేవతిరెడ్డి, కుమార్తె సుచరితరెడ్డి, నియోజకవర్గ నాయకురాలు విజయభారతి ఉన్నారు. పార్టీ కండువా కప్పుకున్న వెంటనే రాకేష్‌రెడ్డి తన ఉద్దేశాన్ని చాటిన తీరు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆర్మూర్ నియోజకవర్గంలో సామాన్యులను బెదిరింపులకు గురిచేస్తూ, బ్లాక్‌మెయిల్ చేసే తరహా రాజకీయాలకు చరమగీతం పాడే ఉద్దేశంతోనే తాను బీజేపీలో చేరినట్లు చెప్పడం విశేషం. టిప్పర్లతో గుద్ది చంపే తరహా హత్యారాజకీయాలకు తెరదించేందుకే వస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. ప్రజలకు కావాల్సింది విద్య, వైద్యం, ఉపాధి కానీ బ్లాక్‌మెయిల్‌కు గురిచేసే వ్యవహారాలు కాదన్నారు. అన్ని వర్గాల పోరాటం, అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ సాధిస్తే ఒక్క కుటుంబమే లాభం పొందిందన్నారు. పేదలకు మేలు చేసేందుకే బీజేపీలో చేరానన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఆదర్శంగా తీసుకుని ముందుకెళతానన్నారు. ఇప్పటికే పేదలకు ఒక్క రూపాయికే కార్పొరేట్ వైద్యం అందిస్తున్నానన్నారు. ఆపదలో ఉన్నవారికి పైడి రాకేశ్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా, ఇతర అన్ని రకాలుగా సహాయం చేస్తున్నామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో తన ముద్ర వేసుకుంటానన్నారు. ఇప్పటికే ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు ప్రత్యామ్నాయం కోసం కళ్లు కాయలు కాచేలా చూస్తున్నారన్నారు. రాకేశ్‌రెడ్డి రూపంలో ఓ కరుడుగట్టిన, కమిట్‌మెంట్‌తో కూడిన కార్యకర్తలాగా తనను బీజేపీ పంపుతోందన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఆర్మూర్‌లో ఫ్యాక్షన్ రాజకీయాలను కూకటి వేళ్లతో పెకిలిస్తానన్నారు. గత కొన్నేళ్లుగా పుట్టిన ఊరికి, చుట్టుపక్కల గ్రామాలకు నిరంతరం సేవ చేస్తున్నానన్నారు. ప్రస్తుతం ఆర్మూర్ నియోజకవర్గంలో హత్యలు, అక్రమాలు, కబ్జాలు నడుస్తున్నాయన్నారు.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి లక్ష్యంగా..

రాకేష్‌రెడ్డి ప్రకటనలు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని లక్ష్యంగా చేస్తుండగా, ఇప్పటికే అందుకు అవసరమైన కార్యాచరణ అమలు చేస్తూ ముందుకు వెళుతున్నట్లు తెలుస్తోంది. ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో అందుకు తగినవిధంగా ప్రణాళికలు తయారు చేసుకున్నట్లు చర్చ జరుగుతోంది. కల్లెడ సర్పంచ్ దంపతులు లావణ్య, ప్రసాద్‌గౌడ్‌లను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కుట్ర చేసి కేసుల్లో ఇరికించినట్లు ఆరోపణలు, అదేవిధంగా నందిపేట సర్పంచ్ దంపతులు కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసిన విషయమై ఇప్పటికే నియోజకవర్గంలోని స్థానిక ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చాలామంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలను రాకేష్‌రెడ్డి కలిసినట్లు తెలుస్తోంది. లక్కంపల్లి మాజీ సర్పంచ్, ప్రస్తుత ఉపసర్పంచ్‌లను హతమార్చేందుకు ఆ గ్రామ సర్పంచ్ భర్త మహేందర్ సుపారీ ఇచ్చిన విషయమై జిల్లాలో సంచలనమైంది. ఎమ్మెల్యే ఇలాంటి వాళ్లను వెనకేసుకురావడం పట్ల రాకేష్‌రెడ్డి ప్రస్తావించారు.

రాకేష్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రతిఒక్కరితో కలిసేలా ప్లాన్ చేసుకోగా, స్థానిక ప్రజాప్రతినిధులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతుండడంతో సమీకరణలు మారనున్నట్లు వివిధ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇవన్నీ చూస్తుంటే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని పకడ్బందీగా ముందుకు కదులుతున్నట్లు తెలుస్తోంది.

నవీన్‌మిట్టల్ దిష్టిబొమ్మ దహనం

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో దళిత, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం కళాశాల విద్యాకమిషనర్ నవీన్‌మిట్టల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తెయూలో ప్రస్తుతం జరుగుతున్న గందరగోళ పరిస్థితులకు నవీన్‌మిట్టల్, ఈసీ మెంబర్లే కారణమని ఆరోపించారు. తెయూ లో దళితులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. ఈసీ ని ప్రక్షాళన చేసిన తర్వాతనే తెయూ రిజిస్ట్రార్ పై నిర్ణయం తీసుకోవాలన్నారు. తక్షణమే తెయూ ఈసీ ని రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీకి ఇచ్చిన సెలవులను వెంటనే వీసీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నిఖిల్, సృజన్, బి.వెంకటరమణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్‌ టోర్నీకి ఎంపికలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సీనియర్‌ లీగ్‌ టోర్నమెంట్‌కు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ కళాశాల ఆవరణలో అండర్‌–25 బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించారు. సుమారు 100మంది క్రీడాకారులకు రావడంతో పేర్లు నమోదు చేసుకోని బౌలింగ్‌, బ్యాటింగ్‌లో క్రీడాకారులు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 35మందిని ఎంపిక చేశారు. ఈ నెల 3న ఇందులో నుంచి 15మందితో తుది జట్టును ప్రకటిస్తామని అసోసియేషన్‌ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన జట్టును ఈ నెల 6 నుంచి హైద్రాబాద్‌లో జరిగే సీనియర్‌ క్రికెట్‌ లీగ్‌ పోటీలకు పంపుతామన్నారు. నయిమ్‌, సూరజ్‌, లలిత్‌, కృష్ణంరాజు, చంద్రాసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌, సురేష్‌, పారస్‌ ఎంపికలను పర్యవేక్షించారు.

తెయూపై ప్రభుత్వం దృష్టి సారించాలి



నిజామాబాద్‌అర్బన్‌: తెలంగాణ యూనివర్సిటీ పాలనపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రమావత్‌ లాల్‌సింగ్‌ అన్నారు. గురువారం నగరంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ పాలన పూర్తిగా స్తంభించిపోయిందన్నారు. యూనివర్సిటీ పాలనను గాడిలో పెట్టాలని డిమాండ్‌ చేశారు.

తెయూ కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన గురువారం కొనసాగింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రెగ్యులరైజ్‌ జీవో వచ్చే వరకు 12 యూనివర్సిటీల్లో నిరసన కొనసాగుతుందన్నారు. డాక్టర్‌ దత్తహరి, రామలింగం, నర్సయ్య, ప్రవీణ్‌, ఆనంద్‌, నర్సింలు, కిరణ్‌ రాథోడ్‌, డానియల్‌, గోపిరాజ్‌, స్వామిరావు తదితరులున్నారు.

పసుపు సాగులో మెలకువలు


పసుపు పంట విత్తనం సిద్ధం చేస్తున్న రైతులు

బాల్కొండ: వానాకాలం సీజన్‌లో పసుపు సాగు చేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలో సుమారు 33 వేల ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేస్తారు. పసుపు సాగులో మెలకువలను బాల్కొండ ఉద్యానవన అధికారి రోహిత్‌ వివరించారు.

నేల సిద్ధం చేయడం..

నేలను బాగా లోతుగా దున్నాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి 40 ట్రాక్టర్ల నల్లమట్టిని నేలలో వేయాలి. ఎకరానికి 20 కిలోల జింక్‌ సల్ఫేట్‌ను వాడాలి. అడుగు మందుగా ఎకరానికి ఆరు బస్తాల సింగిల్‌ సూపర్‌ ఫాస్పేట్‌ చల్లాలి.

విత్తనం ఆదా.. విత్తన శుద్ధి

కొత్త పద్ధతిలో విత్తన కొమ్మును చిన్న చిన్న ముక్కలు చేయడం ద్వారా విత్తనం ఆదా చేసుకోవాలి. విత్తనాన్ని ఒక్క అంగుళం ఉండెట్లు ముక్కలు చేయాలి. దీంతో ఎకరానికి రెండు క్వింటాళ్ల విత్తనం మాత్రమే సరి పోతుంది. విత్తన ముక్కల్ని లీటర్‌ నీటికి 3 గ్రాముల చొప్పున రిడోమిల్‌ గోల్డ్‌ కలిపి తయారు చేసిన ద్రావణంలో అరగంట సేపు నానబెట్టి శుద్ధి చేసి ఆరబెట్టాలి. విత్తన శుద్ధి రెండు, మూడు రోజుల ముందు చేసుకోవాలి. దీంతో విత్తనం వేసే రోజు హడావుడి ఉండదు. పొలుసు పురుగు ఉన్న చోట విత్తన శుద్ధి చేసేటప్పుడు లీటర్‌ నీటికి 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోపాస్‌ కలపాలి.

బెడ్‌ విధానంలో..

బెడ్‌ పద్ధతిలో పసుపు విత్తినట్లయితే బెడ్‌ మీద, బెడ్‌ మధ్యలో 45 సెంటీమీటర్ల ఎడం ఉండెట్లు రెండు లైన్లు, రెండు అంగుళాల లోతు ఉండెట్లు ఏర్పాటు చేసుకోవాలి. బెడ్‌ మీద ఎకరాకు మూడు సంచుల వేప పిండి, ఒక్క బస్తా యూరియా, ఒక్క బస్తా పొటాష్‌ కలిపి లైన్లలో వేయాలి. బెడ్‌పై లైన్లలో విత్తన ముక్కల్ని సుమారుగా 22.5 సెంటీమీటర్ల దూరం ఉండెట్లు విత్తి బాగా కప్పేయాలి. డ్రిప్పు పైపులు పరిచి నీరు బాగా తడిచేటట్లు వదలాలి.

కలుపు నివారణ

విత్తనం వేసిన మరుసటి రోజు ఎకరానికి కిలో చొప్పున అట్రాజిన్‌ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. విత్తనం వేసిన 21 రోజులకు మొలక వస్తుంది. ఎక్కడైన గ్యాపులు వస్తే ముందే ట్రేలలో పెంచిన మొక్కలను వాడాలి.

ఎరువుల వాడకం

విత్తిన మూడు వారాలకు ఎకరానికి 2 కిలోల ట్రైకోడర్మా, 2 కిలోల సుడో మోనాస్‌, 2 కిలోల పొటాష్‌, రెండు కిలోల పిఎస్‌బి బాగా మాగిన పశువుల ఎరువులో, లేదా వేప పిండిలో కలిపి చల్లాలి. విత్తిన 40, 60, 80, 100, 120 రోజులకు ఎకరానికి అర బస్తా యూరియా, అర బస్తా కాంప్లెక్స్‌, ఒక్క బస్తా వేప పిండి కలిపి బెడ్‌పై వరుసల మధ్య వేసి మట్టిలో కలిపి నీరు పెట్టాలి. తోటలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.

ఉద్యమ వ్యతిరేకులే పాలకులయ్యారు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తిరుమలరావు

కామారెడ్డి అర్బన్‌: తెలంగాణ ఉద్యమంలో గొంతెత్తి పిడికిలి బిగించిన కవులు, కళాకారులు రాష్ట్ర ఏర్పాటు అనంతరం నిశబ్దం అయిపోగా.. ఉద్యమ వ్యతిరేకులు చాలా మంది పాలకులయ్యారని ప్రొఫెసర్‌ జయధీర్‌ తిరుమలరావు అన్నారు. తెలంగాణ రచయితల సంఘం(తెరవే) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్‌ శిక్షక్‌ రాసిన 'ధైర్య కవచం' పుస్తకావిష్కరణ సభ గజల్‌కవి సూరారం శంకర్‌ అధ్యక్షతన స్థానిక కర్షక్‌ బీఎడ్‌ కళాశాలలో జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన తిరుమలరావు పుస్తకావిష్కరణ అనంతరం మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజల కోసం తమ రచనలతో పిడికిలి బిగించి పదేళ్ల అన్యాయాలపై కవులు, రచయితలు చైతన్యం చేయాలన్నారు. కొండి మల్లారెడ్డి, రచయిత గఫూర్‌ శిక్షక్‌ పాల్గొన్నారు.

కామారెడ్డి నుంచి దెగ్లూర్‌కు బస్సు ప్రారంభం

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి నుంచి తాడ్వాయి, లింగంపేట్‌, ఎల్లారెడ్డి, నిజాంసాగర్‌, పిట్లం, పెద్దకొడప్‌గల్‌, బిచ్కుంద, మద్నూర్‌ మీదుగా మహారాష్ట్ర దెగ్లూర్‌ వరకు బస్సు ప్రారంభించామని కామారెడ్డి డిపో మేనేజర్‌ మల్లేషం తెలిపారు. కామారెడ్డి నుంచి ఉదయం 11:00 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు దెగ్లూర్‌ చేరుకుంటుందన్నారు. 3 గంటలకు దేగ్లూర్‌ నుంచి ప్రారంభమై సాయంత్రం 6.30 గంటలకు కామారెడ్డి చేరుకుంటుందని చెప్పారు. కామారెడ్డి నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి దేగ్లూర్‌లో నైట్‌ హాల్ట్‌ ఉండి, ఉదయం 6 గంటలకు బయలుదేరి 9:30కి కామారెడ్డి చేరుకుంటుందని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదాల్లో పలువురి మృతి


గంగారాం(ఫైల్‌)

ధర్పల్లి: మండలంలోని హొన్నాజిపేట గ్రామ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందల్వాయి మండలం గౌరారం గ్రామానికి చెందిన మంగళి గంగారం(50) మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణ రెడ్డి తెలిపారు. వివరాలు.. ఇందల్వాయి మండలం పాటితండాకు చెందిన వెంకటరాములు తన బంధువుల పెళ్లికి గంగారాంతో కలిసి హొన్నాజిపేట గ్రామ శివారులోని చెరువు తండాకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఇందల్వాయి వైపు వస్తున్న మారుతి స్విఫ్ట్‌ కారు టైర్‌ పంక్చర్‌ కావడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బైక్‌ నడుపుతున్న మంగళి గంగారం కాలు విరిగి తీవ్ర రక్తస్రావం కాగా వెంకటరాములుకు స్వల్ప గాయాలయ్యాయి. మంగళి గంగారాంను ఆస్పత్రికి తరలిస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో గుండెపోటుతో చనిపోయాడని, వెంకటరాములుకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన గడ్డమీది తండాకు చెందిన కేతావత్‌ రవిపై వెంకటరాములు అన్న శ్రీరామ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు..


ఒడ్డె రాజు (ఫైల్‌)..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీద్‌పేటలో గురువారం ఓ కారు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై సంతోష్‌ కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం బానాపూర్‌కు చెందిన ఒడ్డె రాజు (44) కొన్నేళ్లుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం ఆటోలో కూలీలను ఫరీద్‌పేటలో దించి తిరిగి వెళ్తుండగా అతి వేగంగా అజాగ్రత్తగా దోమకొండ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో రాజుకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- గుంత తవ్వుతుండగా కారు ఢీకొని ఒకరు మృత్యువాత


కారు ఢీకొనడంతో మృతి చెందిన రాజయ్య

నాగిరెడ్డిపేట/మాచారెడ్డి: నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామశివారులో ప్రధానరహదారి పక్కన తవ్వకం పనులు చేపట్టిన మాచారెడ్డి మండలం అక్కాపూర్‌ గ్రామానికి చెందిన శీలం రాజయ్య(55) గురువారం ఉదయం కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ధర్మారెడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పైప్‌లైన్‌ వేసేందుకు బోధన్‌–హైదరాబాద్‌ ప్రధానరహదారి కింద నుండి తవ్వకం పనులు చేపట్టేందుకు రాజయ్యతోపాటు అదే మండలానికి చెందిన పుట్ట బాలరాజు, పల్లపు నరసింహా కూలీలుగా వచ్చారు. కాగా హైదరాబాద్‌కు చెందిన తాడిపత్రి రాజ్‌కుమార్‌ కారులో బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా టైరు పంక్చర్‌ కావడంతో అదుపుతప్పి రోడ్డుపక్కనే పైపులైన్‌ కోసం తవ్విన గుంతలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో గుంతలో నిలబడి పైప్‌లైన్‌ పనులు చేస్తున్న రాజయ్యను కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి కుమారుడు దేవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

విద్యుత్‌ వైర్లు తగిలి రెండు గేదెలు మృతి


మృతి చెందిన గేదెలు

కామారెడ్డి రూరల్‌: విద్యుత్‌ అధికారుల నిర్లక్ష్యంతో పాడి గేదెలు మృతి చెందుతున్నాయని రైతులు సబ్‌స్టేషన్‌ ఎదుట ఆందోళనకు దిగారు. కామారెడ్డి మండలం గర్గుల్‌లో పంట చేలలోని విద్యుత్‌ వైర్లు కిందికి వేలాడుతున్నాయని, వైర్లను సరిచేయాలని పలుమార్లు విద్యుత్‌ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో గురువారం మొగుళ్ల సాయాగౌడ్‌కు చెందిన రెండు గేదెలు విద్యుత్‌ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయన్నారు. విద్యుత్‌ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు అడ్లూరు శివారులోని సబ్‌ స్టేషన్‌ వద్ద ఆందోళనకు దిగారు. సుమారు గంటపాటు సబ్‌ స్టేషన్‌ ఎదుట ఆందోళన చేయడంతో అటువైపుగా వెళుతున్న కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ పరిస్థితిని గమనించి రైతుల వద్దకు వెళ్లి విషయాన్ని తెలుసుకున్నారు. వేలాడుతున్న వైర్లను వెంటనే సరి చేయిస్తానని రైతులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

దేశీదారు పట్టివేత

బోధన్‌టౌన్‌: మహారాష్ట్ర నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లను పట్టణంలోని బస్టాండ్‌ వద్ద టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకున్నారు. సీఐ ప్రేమ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం టాస్క్‌ఫోర్స్‌ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్‌ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా అనీసా నగర్‌ కాలనీకి చెందిన బిస్మిల్లాఖాన్‌ ఆటోలో నాలుగు దేశీదారు బాటిళ్లు దొరికాయన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య


వినోద(ఫైల్‌)

బిచ్కుంద: మండలంలోని ఎల్లారంలో భర్త, అత్త వేధింపులు భరించలేక వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కంగ్టి మండలానికి చెందిన వినోదకు ఎల్లారం గ్రామానికి చెందిన సాయగౌడ్‌తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త సాయాగౌడ్‌, అత్త సత్యవ్వ వేధించడంతో ఇంటి పక్కనే ఉన్న చెట్టుకు ఉరివేసుకొని చ నిపోయింది. భర్త, అత్త తమ కూతుర్ని కొట్టి చంపే శారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

రాజంపేట: జీవితం విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌ గ్రామానికి చెందిన కొప్పుల కృష్ణమూర్తి(54) గత కొంత కాలంగా లంగ్స్‌ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆపరేషన్‌ అయినా ఆరోగ్యం బాగలేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం కృష్ణమూర్తి ఉరి వేసుకుని మరణించినట్లు గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

నన్ను ఎందుకిలా వదిలేశారు



మోర్తాడ్‌: తెలంగాణవాదులు, ఉద్యమకారులకు వందనాలు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరులకు గుర్తుగా నన్ను నిర్మించారు. 2013లో మోర్తాడ్‌ మండలంలోని శెట్‌పల్లిలో అమరవీరుల స్థూపం నిర్మాణం చేపట్టారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున సాగిన సమయంలో నన్ను నిర్మించడం ఎంతో సంతోషం కలిగించింది. కానీ అంతలోనే నన్ను మరిచిపోయారు. శెట్‌పల్లి ప్రజలు ఇచ్చిన విరాళాలతో నా నిర్మాణం ఆరంభించారు. నా బాగోగులను మొదటి నుంచి చూసిన తెలంగాణ వాది అడ్వాల లింబాద్రి(రైల్వే ఉద్యోగి) అనారోగ్యంతో మరణించడంతో నన్ను పట్టించుకునేవారు కరువయ్యారు. ఇదంతా ఇప్పుడు మీకు ఎందుకు చెబుతున్నా అంటే జూన్‌ 2 నుంచి 22 వరకు దశాబ్ది సంబరాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. మరి ఎంతో మంది అమరులకు స్మారకంగా నిలిచే నన్ను మాత్రం ఎవరు పట్టించుకోవడం లేదు. నా నిర్మాణం పూర్తి చేసి అమరులను యాది ఉంచుకోవాలని మనవి.

ఇట్లు
మీ అమరవీరుల స్మారక స్థూపం
శెట్‌పల్లి, మోర్తాడ్‌ మండలం

జీఆర్‌టీ షోరూం ప్రారంభం


జీఆర్‌టీ జ్యువెల్లర్స్‌ షో రూం


షో రూంలో నగలు చూస్తున్న మహిళలు

నిజామాబాద్‌ సిటీ: జీఆర్‌టీ జ్యువెలర్స్‌ వినియోగదారుల నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమయ్యే ఆభరణాలను రూపొందిస్తుందని జీఆర్‌టీ జ్యువెలర్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఆనంద్‌ ఆనంతపద్మ నాభన్‌ అన్నారు. జీఆర్‌టీ జ్యువెలర్స్‌ 58వ షోరూంను గురువారం నిజామాబాద్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి జీఆర్‌టీ షోరూంలాగే ఇది కూడా అద్భుతమైన ఆభరణాలను కలిగి ఉంటుందన్నారు. ఆభరణాల కొనుగోలు ప్లాన్‌లపై ప్రత్యేక ఆఫర్లు నెల వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు రూ.50 తక్కువ, పాత బంగారం మార్పిడిపై ప్రతి గ్రాముకు రూ.50 అదనపు తగ్గింపు, డైమండ్‌, అన్‌కట్‌ డైమండ్‌ విలువపై 10శాతం, వెండి వస్తువుల మేకింగ్‌ చార్జిలపై 25శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. షోరూంలో పిల్లల సంరక్షణ గదిను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కస్టమర్లు ఎక్కడి నుంచి అయినా షాపింగ్‌ చేసేలా తాము జీఆర్‌టీ లైవ్‌ షాపింగ్‌ను కూడా కలిగి ఉన్నామన్నారు.

'అందరిని మెప్పిస్తున్న మేము ఫేమస్‌ మూవీ'


మాట్లాడుతున్న సినిమా యూనిట్‌ సభ్యులు

నిజామాబాద్‌ సిటీ: కొత్త నటీనటులతో నిర్మించిన 'మేం ఫేమస్‌' మూవీ అందరినీ మెప్పిస్తోందని చిత్ర యూనిట్‌ సభ్యులు పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్‌ కంఠేశ్వర్‌ బైపాస్‌ హోటల్‌ లహరిలో వారు మీడియాతో మాట్లాడారు. లహరి ఫిలిమ్స్‌, చాయి బిస్కెట్‌ ఫిలిమ్స్‌ ఆధ్వర్యంలో నిర్మించిన మేము ఫేమస్‌ సినిమాలో నటించిన వారందరూ తెలంగాణ ప్రాంతానికి చెందిన కొత్త నటులన్నారు. ఈ సినిమా మే 26న విడుదల అయిందని నిర్మాతలు శరత్‌, అనురాగ్‌, చంద్రు తెలిపారు. హీరో సుమన్‌ ప్రభాస్‌ మాట్లాడుతూ రాజామౌళి, మహేష్‌ బాబు లాంటి వాళ్లు తమ సినిమా చూసి అభినందిచటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు 99 రూపాయలకు టికెట్స్‌ అందించనున్నట్లు తెలిపారు. సైడ్‌ హీరో మౌర్య, మణి, హీరోయిన్‌ సార్య, సిరి రాసి, మ్యూజిక్‌ డైరెక్టర్‌ కల్యాణ్‌ నాయక్‌, నరేంద్ర పాల్గొన్నారు.

వీసీపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి):వీసీ చేసిన అవినీతి అక్రమాలపై వెంటనే సిట్టింగ్‌ జడ్జితో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, పర్మినెంట్‌ రిజిస్ట్రార్‌ను నియమించి తెయూ పాలనను గాడిలోపెట్టాలని ఏబీవీపీ స్టేట్‌ కమిటీ మెంబర్‌ బచ్చనబోయిన శివ డిమాండ్‌ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీ అభివృద్ధిని పక్కనపెట్టి వివాదాలు, రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. అవినీతి అక్రమాలు జరిగిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. నాయకులు నవీన్‌, ప్రమోద్‌, సందీప్‌, సాయితేజ, శ్రీకాంత్‌, మోహన్‌ పాల్గొన్నారు.


క్వారీని తనిఖీ చేసిన అధికారులు



బిచ్కుంద: మండలంలోని పుల్కల్‌ క్వారీని గురువారం మైన్స్‌, టీఎస్‌ఎండీసీ, రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. అనుమతి ఒకచోట తవ్వకాలు మరోచోట చేస్తున్నారని, ప్రభుత్వ భూమిలో ఇసుక తవ్వుతున్నారని పుల్కల్‌, వాజిద్‌నగర్‌ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్‌ ఆయా శాఖల అధికారులను క్వారీ సందర్శించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు ఇసుక తవ్విన స్థలాన్ని సందర్శించారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన ర్యాలీ

దోమకొండ: హెచ్‌ఐవీ నిర్మూలనకు నివారణ ఒక్కటే మార్గమని చైల్డ్‌ఫండ్‌ ఇండియా లింకు వర్కర్‌ స్కీం డీఆర్‌పీ గర్ధాస్‌ సుధాకర్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్‌, సర్పంచ్‌ నల్లపు అంజలి, సింగిల్‌ విండో చైర్మన్‌ పన్యాల నాగరాజ్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ గజవాడ శ్రీకాంత్‌, ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంట్‌ సంగీత్‌కుమార్‌, వైద్యులు నిఖిల్‌, పంచాయితీ కార్యదర్శి సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బైక్‌పై దింపుతామని నమ్మించి అత్యాచారం

నిందితుల రిమాండ్‌

బిచ్కుంద: జుక్కల్‌ వెళ్లడానికి బస్సు కోసం ఎదురుచూస్తున్న ఓ యువతిని బైక్‌పై దింపుతామని నమ్మించి అత్యాచారం చేశాడో వ్యక్తి. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. జుక్కల్‌ మండలంలో ఓ గ్రామానికి చెందిన అమ్మాయి ఖండెబల్లూర్‌ చౌరస్తాలో బుధవారం జుక్కల్‌ వెళ్లడానికి బస్సు కోసం నిరీక్షిస్తుంది. అదే గ్రామానికి చెందిన ఆమెకు పరిచయం ఉన్న పవన్‌, సచిన్‌ అనే ఇద్దరు బైక్‌పై వచ్చి జుక్కల్‌ వెళ్తున్నామని చెప్పారు. బైక్‌పై దింపుతామని చెప్పడంతో ఆమె వారి బైక్‌ ఎక్కింది. నిందితులు అక్కడి నుంచి జుక్కల్‌ వెళ్లకుండా బిచ్కుంద శివారులోకి తీసుకొచ్చి పవన్‌ అమ్మాయిపై అత్యాచారం చేసి కొట్టి అక్కడి నుంచి పారిపోయాడు. అమ్మాయి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. వారు వెంటనే బిచ్కుంద పోలీసులను ఆశ్రయించారు. సీఐ కృష్ణ, ఎస్సై శ్రీధర్‌రెడ్డి విచారణ చేపట్టి ఇద్దరు నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

భిక్కనూరులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

సర్పంచ్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలు

భిక్కనూరు: భిక్కనూరులో బుధవారం అర్ధరాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని ఎస్సై ఆనంద్‌గౌడ్‌ తెలిపారు. వివరాలు.. గ్రామంలోని చమాన్‌ ప్రాంతంలో పెళ్లి బరాత్‌ ఊరేగింపు జరుగుతోంది. ఆ సమయంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు జ్ఞానప్రకాశ్‌రెడ్డికి పెళ్లి ఊరేగింపులో ఉన్న వారికి మధ్య గొడవ జరిగింది. అది ఘర్షణకు దారితీసింది. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ తున్కి వేణు, ఎంపీటీసీ సువర్ణ భర్త ప్రభాకర్‌, బీఆర్‌ఎస్‌ నేత సుబ్బారావు అక్కడికి వెళ్లారు. దీంతో శ్రీధర్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డికి సర్పంచ్‌ వేణు, ప్రభాకర్‌, సుబ్యారావు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో సర్పంచ్‌కు, ప్రభాకర్‌, సుబ్బారావు, జ్ఞానప్రకాశ్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఈ గొడవలో సర్పంచ్‌ వేణు చెయ్యి విరిగింది. తమపై శ్రీధర్‌రెడ్డి, జ్ఞానప్రకాశ్‌రెడ్డి దాడి చేశారని సర్పంచ్‌ వేణు, ప్రభాకర్‌, సుబ్యారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మాపై రాళ్లతో దాడి చేశారు

బరాత్‌ను తన సోదరుడు శ్రీధర్‌రెడ్డితో కలిసి చూస్తుండగా కావాలని కొందరు తమతో వాగ్వాదానికి దిగి రాళ్లతో దాడిచేశారని బీఎస్పీ నేత జ్ఞానప్రకాశ్‌రెడ్డి తెలిపారు. తమ కార్ల అద్దాలను ధ్వంసం చేశారని, మూకుమ్మడిగా దాడిచేశారని ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.